ప్రజాశక్తి

శుక్రవారం 10, మార్చి 2023

5

శ్రీ సత్యసాయి

పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామగ్రి సిద్ధం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో పోలింగ్ కేంద్రాల వారిగా సిద్ధం చేస్తున్న మెటీరియల్‌ను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రిసైడింగ్ అధికారుల చెక్ లిస్ట్ ఆధారంగా సూచించిన 30 రకాల వస్తువులను తప్పనిసరిగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పంపిణీ జరిగేలా చూడాలని ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ బ్యాలెట్ బాక్సులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎసిబి అధికారులు అరెస్టుచేసిన వీఆర్వో లక్ష్మీదేవి, స్వాధీనం చేసుకున్న నగదు

ఎసిబి చేతికి అవినీతి రెవెన్యూ చేప

వీఆర్వో లక్ష్మీదేవిని అదుపులోకి తీసుకున్న అధికారులు

ప్రజాశక్తి-మడకశిర

సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం రోళ్ల మండలం దొడ్డేరి గ్రామానికి చెందిన వీఆర్వో లక్ష్మీదేవి పట్టాదారు పాసుపుస్తకం కోసం రూ.6 వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. రోళ్ల మండలం దొడ్డేరి పంచాయతీ పరిధిలోని అప్పేపల్లి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి, రంగమ్మ దంపతులు అనువంశికంగా వచ్చిన భూమిని సాగు చేసుకుంటున్నారు. 2006 సంవత్సరంలో రైతు గోవిందరెడ్డి మృతి చెందాడు. అనంతరం ఆయన భార్య పేరున భూమి పాసుబుక్కులు ఇచ్చారు. అయితే వీరి కుమారులు తిమ్మారెడ్డి, వెంకటాచలపతి లు పొలం భాగపరిష్కారం చేసుకోవడం కోసం 2.7.2021లో మడకశిర సబ్ రిజిస్టర్ కార్యాలయానికి వెళ్లారు. మీ పేరున పాసుబుక్ లేదా వన్ బి ఉంటేనే రిజిస్ట్రేషన్ అవుతుందని అధికారులు సూచించారు. దీంతో వారు దొడ్డేరి వీఆర్వో లక్ష్మీదేవిని సంప్రదించారు. ఆమె వన్ బి, పాస్‌బుక్ కావాలంటే రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే మధ్యవర్తుల చొరవతో రూ.9 వేలకు ఒప్పందం కుదుర్చుకుని రూ.3 వేలు అడ్వాన్స్ ఆమెకు ముట్టజెప్పారు. ఎన్ని రోజులైనా పాస్‌బుక్ ఇవ్వకపోవడంతో మళ్లీ వారు వీఆర్వోను సంప్రదించారు. అందుకు ఆమె మిగతా రూ.6 వేలు ఇస్తేనే పాసుబుక్కు ఇస్తామని స్పష్టం చేశారు. విధిలేని పరిస్థితుల్లో బాధితులు ఎసిబిని ఆశ్రయించారు. గురువారం తిమ్మారెడ్డి, వెంకటాచలపతి వీఆర్వోకు నగదు అందిస్తుండగా ఎసిబి డిఎస్‌పి ఆధ్వర్యంలో మెరుపు దాడులు చేశారు. నగదును స్వాధీనం చేసుకుని వీఆర్వో లక్ష్మీదేవిని అరెస్టు చేశారు.

హోరా హోరీ..

ఉధృతంగా ప్రచారాలు
రేపటితో ముగియనున్న ఎన్నికల ప్రచారం
ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శాసనమండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల ప్రచారాలు హోరా హోరీగా సాగుతున్నాయి. ప్రచారాలకు ఇక రెండు రోజులు మాత్రమే గడువుండటంతో ప్రధాన అభ్యర్థుల ప్రచారాలు తారా స్థాయికి చేరాయి. ఆరు జిల్లాలు కలిపి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గంగా ఉంది. పట్టభద్రులకు సంబంధించి 42 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన నాటి నుంచి అభ్యర్థులు ప్రచారాలు చేసుకుంటున్నారు. ఇక రెండు రోజులు మాత్రమే ప్రచారానికి సమయముంది. మార్చి 13వ తేదీన పోలింగు జరుగుతుంది. 11వ తేది సాయంత్రానికి ప్రచారాలను ముగించాల్సి ఉంటుంది. రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో అభ్యర్థులు ఆరు జిల్లాల్లోనూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆరు జిల్లాల్లో తిరగాల్సి రావడంతో తిరికలేకుండా ప్రచారాల్లో తలమునకలవుతున్నారు. వీరి తరపున ఆయా ప్రాంతాల్లో ప్రచారాలు చేస్తున్న వారూ ఉన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులు ముందంజ..

శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి జరుగుతున్న ప్రచారాల్లో ప్రధాన పార్టీలకు ధీటుగా పిడిఎఫ్ అభ్యర్థులు పట్టభద్రులకు నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డిలు ప్రచారం చేస్తున్నారు. వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఉండగా, టిడిపి తరపున రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు. వైసిపి అధికార బలంతోపాటు, ధనబలాన్ని నమ్ముకుని ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు సిద్ధం చేసుకుంటోంది. ప్రచారాలు ముగుస్తుండటంతో ప్రలోభాలకు తెరలేపేందుకు సన్నద్ధమైనట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక టిడిపి ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు తమకు లాభిస్తాయన్న ఆలోచనలో ఉంది. ఈ మేరకు ప్రచారాలు చేస్తున్నారు. ఇక పిడిఎఫ్ మాత్రం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక బలంతోపాటు, కాంగ్రెసు, జనసేన, సిపిఎం, సిపిఐలు మద్దతు ప్రకటించాయి. వారి తరపున పెద్దఎత్తున ప్రచారాలు చేస్తున్నారు. ప్రధాన అభ్యర్థుల కంటే పిడిఎఫ్ అభ్యర్థులు ప్రచారాల్లో ముందంజలో ఉన్నారని చెప్పవచ్చు.

ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

పోలింగు సమయం దగ్గర పడుతుండటంతో ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలైంది. జిల్లా కలెక్టరు ఎస్.నాగలక్ష్మి రిటర్నింగు అధికారి కావడంతో ఆరు జిల్లాల్లో కలెక్టర్లను సమన్వయం చేసుకుని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. అదే విధంగా జిల్లాలో బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ఏర్పాట్లకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గురువారం నాడు ఎన్నికల్లో పాల్గొనే ప్రొసిడింగు అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగు సజావుగా జరిగేందుకు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యహరించాలని ఈ సమావేశంలో అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. ఓటరు స్లిప్పులతోపాటు, గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉంటేనే అనుమతించాలని ప్రొసిడింగు అధికారులకు సూచించారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సులు భద్రపరచడం, కౌంటింగు నిర్వహించడం జెఎన్‌టియు కళాశాలలో జరుగుతుంది. అక్కడి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

నారసింహుడి రథోత్సవానికి ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలో ఈనెల 13వ తేదీ సోమవారం నిర్వహించనున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవానికి విచ్చేయు భక్తుల సౌకర్యార్థం డిపోలో ఉన్న 114 బస్సులకు అదనంగా 30 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు సత్యసాయి జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. గురువారం కదిరి డిపో కార్యాలయంలో రథోత్సవం సందర్భంగా ప్రయాణికుల సౌకర్యాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అదనపు బస్సుల వివరాలను వెల్లడించారు. కదిరి నుండి గోరంట్ల మీదుగా హిందూపురంకు 26 బస్సులు, నల్లమాడకు 7 బస్సులు, మదనపల్లికి 25 బస్సులు, బెంగుళూరుకు 20 బస్సులు, పులివెందులకు 9 బస్సులు, తలుపులకు 7 బస్సులు దాదాపు 117 ట్రిప్పులతో బస్సులను నడుపుతామని తెలియజేశారు. బ్రహ్మ రథోత్సవానికి విచ్చేయు వేలాది మంది భక్తాదులకు రవాణా సౌకర్యం ఏర్పాట్లపైన కదిరి డిపో సూపర్‌వైజర్లు, ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని చెప్పారు. ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, డిపోల నుండి 30 కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను తెప్పిస్తున్నామని అన్నారు. స్థానిక జీవిమాను సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, బస్టాండు, సరస్వతి విద్యామందిరం వద్ద ప్రయాణికులకు ఎండ వేడిమి నుంచి ఊపశమనం కోసం ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు. మంచినీటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, ప్రతి షెల్టరులో ఇద్దరు పోలీసులను (ఆర్టీసీ కానిస్టేబుల్స్), ఇద్దరు సేఫ్టీ డ్రైవింగ్ శిక్షకులను, ఇద్దరు వాలంటీర్లను, సూపర్‌వైజర్లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ప్రయాణికులు తమ సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే రావాలని కోరారు. ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలకు, ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. ఈ సమావేశంలో డిపో మేనేజరు మైనుద్దీన్, అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్, అసిస్టెంట్ ఇంజినీరు రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగివుండాలి

ఓటర్ స్లిప్‌తో పాటు ఓటరు గుర్తింపు కార్డూ తప్పనిసరి
రిటర్నింగ్ అధికారి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల నిర్వహణ, నిబంధనలపై ప్రిసైడింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగివుండాలని అప్పుడే సజావుగా ఎన్నికలు నిర్వహించగలమని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నియామావళిపై ప్రిసైడింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులకు నిర్వహిస్తున్న రెండవ రోజు శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మెటీరియల్‌లోని అంశాలను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలోనే అధికారులు తమకున్న సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్నికల మెటీరియల్ తీసుకొని వెళ్లేసమయంలో వారికి అందిస్తున్న మెటీరియల్‌ని రిసెప్షన్ కౌంటర్‌లోనే సరి చూసుకోవాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఇతర సిబ్బంది సైతం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది ముందు రోజే పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారన్నారు. కాబట్టి వారు వారి పోలింగ్ కేంద్రాల్లోనే ఉండాలని, బయట తిరగరాదన్నారు. ఓటింగ్ కంపార్ట్‌మెంట్ ఎక్కడ ఉంచాలో చూసుకోవాలని, అక్కడ తగిన వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉదయం 7.30 గంటల కల్లా పోలింగ్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాలకు పంపాలని అభ్యర్థులకు సూచించామన్నారు. అంతకుముందే పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని విధాల సన్నద్ధమై ఉండాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు వచ్చాక వారికి బ్యాలెట్ బాక్సులు చూపించి, ఖాళీగా ఉందని ధ్రువీకరించి, డిక్లరేషన్‌లో వారితో సంతకం తీసుకొని సీల్ చేయాలన్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఆ రోజు సాయంత్రం 4 గంటల తర్వాత వచ్చే ఓటర్లను అనుమతించాల్సిన అవసరం లేదన్నారు. అంతలోపు క్యూలో నిలబడి ఉన్న ఓటర్లకు టోకెన్లు ఇచ్చి వారిని మాత్రమే ఓటింగ్‌కు అనుమతించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా, ఎలా ఓటు వేయాలో తెలిపే పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్లు ఓటర్ స్లిప్పుతో పాటు ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డును కూడా తప్పనిసరిగా తీసుకొని రావాల్సి ఉంటుందన్నారు. గ్రాడ్యుయేట్స్ ఓటు వేయడం కోసం రెండు కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్స్ ఒక్కటే ఉంటుందన్నారు. ఓటర్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి తనకు నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత క్రమంలో అంకెలు వేసి, బ్యాలెట్ పేపర్‌ను సక్రమంగా మడిచి బ్యాలెట్ బాక్స్‌లోకి వేయాలన్నారు. ఓటరు పోలింగ్ కేంద్రంలోనికి వచ్చేటప్పుడు తనతో పాటు సెల్‌ఫోన్ తీసుకురాకూడదని తెలిపారు. పీవో ఇచ్చిన పెన్‌తో బ్యాలెట్ పేపర్‌లో ప్రాధాన్యత అంకెలను వేసి తిరిగి ఆపెన్ను అధికారికి అప్పగించేలా సిబ్బంది తగిన జాగ్రత్త వహించాలన్నారు. పోలింగ్ పూర్తయ్యాక వీలైనంత త్వరగా సీలింగ్, ఇతర మెటీరియల్ ప్యాకింగ్ చేసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ అకౌంటు, పేపర్ సీల్ అకౌంట్, పిఒ డైరీ, సక్రమంగా సిద్ధం చేసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్లు ఎన్ని ఉన్నాయి? ఎన్ని వాడారు, వాడనివి ఎన్ని పరిశీలించి బ్యాలెట్ పేపర్ అకౌంట్‌తో సరి చూసుకోవాలన్నారు. పిఒ డైరీ సక్రమంగా పూరించి ఉండాలన్నారు. ఫార్మాట్‌లన్నీ సక్రమంగా పూరించాలన్నారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్నికల శిక్షణ అధికారి నరసింహారెడ్డి ఎన్నికల నిర్వహణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, డిఆర్ఒ గాయత్రీ దేవి, కళ్యాణదుర్గం, గుంతకల్ ఆర్‌డిఒలు ఎ.నిశాంత్ రెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్

మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను పరిశీలించిన సిపిఎం

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని మెడికల్ కళాశాల నిర్మాణ పనులను సిపిఎం నాయకులు పరిశీలించారు. పార్టీ మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దన్న తదితరులు కాలేజీ నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలనకు వెళ్తున్న సిపిఎం నాయకులను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకొనే ప్రయత్నం చేశారు. అయితే ఎట్టకేలకు నాయకులు వీటిని అధిగమించి కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో భాగంగా జరుగుతున్న బ్లాస్టింగ్ పనులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పట్టపగలు భద్రత ప్రమాణాలు పాటించకుండా చేస్తున్న పనుల వలల వాహనదారులు, కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా కాంట్రాక్టరు నిర్మాణ పనులకు కార్మికులను బయట రాష్ట్రాల నుంచి బీహార్, బెంగాల్ నుండి తీసుకువచ్చి కనీస వేతనాలు ఇవ్వకుండా కనీస సౌకర్యాలు కల్పించకుండా వ్యవహరిస్తున్నారన్నారు. నివాస ప్రాంతంలో కరెంటు, నీరు, మరుగుదొడ్లు,తిండి తదితర సౌకర్యాలు కల్పించ లేదన్నారు. అడవి జంతువుల నుండి ప్రాణహాని ఉన్నా వారికి రక్షణ సౌకర్యాలు కల్పించడం లేదనానరు. రోజువారి కూలీ 350 రూపాయల నుండి 400 రూపాయలు ఇస్తూ కార్మికులను నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. స్థానికులకు నిర్మాణం పనులలో ఉపాధి ఆకావకాశాలు కల్పించాలన్నారు. రోజు కూలీ 800రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెనుకొండ సబ్ కలెక్టర్ జోక్యం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబావలి ,మహబూబ్ బాషా, వజ్రం నాగప్ప, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగాధర్, వెంకటరాముడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

చట్టసభల్లో ప్రశ్నించే వారికే పట్టంకట్టండి

పుట్టపర్తి, హిందూపురంలో ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

చట్టసభలలో ప్రశ్నించే నాయకులు లేకపోతే అరాచకం రాజ్యమేలుతుందని,సమస్యలపై ప్రయత్నించి పోరాడే నాయకులకే ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టం కట్టాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, పాఠశాలలు, సచివాలయాలు, మున్సిపాలిటీ ఉద్యోగులను ప్రజా సంఘాల నాయకులు కలిసి పిడిఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకుడు ఇంతియాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, మాట్లాడుతూ ప్రజల పక్షాన, ఉపాధ్యాయుల పక్షాన నిలబడి ప్రశ్నించే నాయకులకు అవకాశం ఇవ్వకుంటే అవినీతి అక్రమాలు అరాచకం రాజ్యమేలుతుందని హెచ్చరించారు. ఓటు హక్కు ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులందరూ ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాల వల్ల ఉద్యోగులకు భద్రత లేదన్నారు. ఉద్యోగుల పక్షాన ప్రశ్నించేవారు ఉండాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, కార్మిక సంఘం నాయకులు పై పల్లి గంగాధర్, రామకృష్ణ, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం

హిందూపురం :ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై నిత్యం పోరాడే పటిమ ఉన్నా ప్రజా నాయకులను శాసనమండలి ఎన్నికల్లో గెలిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఎఐటియుసి జిల్లా నాయకులు వినోద్‌కుమార్ కోరారు. గురువారం ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐటియుసి ఆద్వర్యంలో విడివిడిగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తినరసింహరెడ్డిలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆద్వర్యంలో పట్టణంలో వివిధ పాఠశాలలు, కళాశాలలో ఉపాధ్యాయులను, ఉద్యోగులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఎఐటియుసి ఆద్వర్యంలో పట్టణంతో పాటు రూరల్ మండలంలోని సంతేబిదనూరు, చౌళూరు, కిరికెర, తుమకుంట, పంచాయతీల్లో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు బాబు, కృష్ణ, ఫక్రుద్దీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నంబుల పూలకుంట : పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థ పోతుల నాగరాజును గెలిపించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు గురువారం మండల కేంద్రంలోని పాఠశాలలు, కార్యాలయాలు, సచివాలయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి కరపత్రాలు, మోడల్ బ్యాలెట్లు అందజేశారు. మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థులకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బడా సుబ్బిరెడ్డి, నాగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్పీకుంటలో నాయకుల ప్రచారం

పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్య వ్యవస్థ మెరుగు పర్చడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు అన్ని కాలువలు పొంగి పోర్లాయి. దీంతో ఆ కాలువల్లో వ్యర్థాలతో పాటు మట్టి ఎక్కువగ ఉండి దోమలు వృద్ధి చెందడంతో పాటు ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం జెసిబి, ఇటాచిలను ఏర్పాటు చేసి ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులను కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పారిశుధ్యం మెరుగు పర్చాలంటే పట్టణ ప్రజలు సహకరించాలన్నారు.కొన్ని ప్రాంతాల్లో చెత్తను కాలువల్లోకి వేయడం వల్ల మురుగు నీరు నిలబడడంతో దోమలు విపరీతంగా పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. పారిశుధ్య మెరుగుకు పురపాలక సంఘం వారు తీసుకునే చర్యలకు ప్రజలు సహకరిస్తే మెరుగైన ఫలితాలు సాధించడానికి అవకాశాలున్నాయన్నారు.

ఏప్రిల్ 15 నాటికి రీ సర్వే ప్రక్రియ పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఏప్రిల్ 15 నాటికి రీ సర్వే పక్రియ పూర్తి చేస్తామని సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్‌కు జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ వివరించారు. గురువారం విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం క్రింద జరుగుతున్న రీ సర్వే ఏప్రిల్ 15 నాటికి పూర్తి చేస్తామన్నారు. ఈ పథకం కింద మొదటి విడత 26 గ్రామాల్లో రెండవ విడత 25 గ్రామాల్లో రీ సర్వే చేపట్టామని నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని చెప్పారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు అధిగమించి సకాలంలో పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ, రీ సర్వే చేపట్టిన గ్రామాల్లో గ్రౌండ్ టు థింక్ పక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే ఎడి రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న పుట్టపర్తి నాయకులు

లోకేష్ పాదయాత్రకు సంఘీభావం

పుట్టపర్తి రూరల్ : లోకేష్ 500 కిలోమీటర్ల పాదయాత్ర సందర్భంగా పుట్టపర్తి ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు షామీర్ సంఘీభావం తెలిపారు. లోకేష్‌తో కలసి పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్ర 500 కిలోమీటర్ల మైలురాయిని చేరుకున్న సందర్భంగా జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

గాండ్లపెంట : పశువులకు గాలికుంటు వ్యాధికి సోకకుండా టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి. బి .చెన్నకేశవులు నాయక్ తెలిపారు. ఇప్పటిదాకా దాదాపు 128 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన చెప్పారు. ఈనెలాఖరు వరకు ఈ కార్యక్రమం ఉంటుందని రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని కరారు. పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని ప్రారంభించిన ఆర్‌జె రత్నాకర్

పుట్టపర్తి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ లక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జె రత్నాకర్ గురువారం ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని కోవెలకుంటపల్లి గ్రామంలో పురాతన వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పునర్ నిర్మించారు. ఈ సందర్భంగా ఆ ఆలయంలో గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి ఆ గ్రామస్తులు వారి వారి స్థాయికి తగ్గట్లు విరాళాలు ఇచ్చారు. అలాగే దాతల దగ్గర నుంచి విరాళాలు సేకరించి ఈ ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామస్తులు తెలిపారు. రాబోయే రోజులలో ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అందరి సహాయ సహకారాలు కావాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గాంధీనగర్ లో ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మధుసూదన్ గౌడ్ భార్య ప్రసన్నలక్ష్మి (40) ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మధుసూదన్ గౌడ్, భార్య ప్రసన్నలక్ష్మిలకు ఇద్దరికి రెండో వివాహం. మధుసూదన్ గౌడ్ మొదటి భార్య ఇతనిని వదిలేసి వెళ్లిపోయి మరో వివాహం చేసుకుంది. దీంతో అనంతపురానికి చెందిన తన భర్తకు విడాకులు ఇచ్చిన ప్రసన్నలక్ష్మిని ఆరేళ్ల క్రితం మధుసూదన్ గౌడ్ రెండో వివాహం చేసుకున్నాడు. మధుసూదన్ గౌడ్ వద్ద మొదటి భార్యకు పుట్టిన కుమారుడు ఉన్నాడు. రెండో భార్యకు పిల్లలు పుట్టలేదని తరచూ భార్య, భర్తలు గొడవపడేవారు. గురువారం మధ్యాహ్నం కూడా భర్త తాగి వచ్చి భార్యతో గొడవ పడగా ఆమె భర్తను బయటకు పంపించి బెడ్రూంలో తాను కట్టుకున్న చీరతోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బయటకు వెళ్లిన భర్త సాయంత్రం ఇంటికి వెళ్లి బెడ్రూంపైన ఉన్న కిటికీలో చూడగా ప్రసన్నలక్ష్మి ఉరి వేసుకున్నట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా వన్ టౌన్ పోలీసుల వద్ద భర్త మధుసూదన్ గౌడ్ లొంగిపోయాడు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

పుట్టపర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా పెన్షనర్ల సంఘం నాయకులు జిల్లా అధికారులకు గురువారం వినతి పత్రం అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవో కార్యాలయం, పుట్టపర్తి తహశీల్దారు, జిల్లా ఉప ఖజానా అధికారికి వినతి పత్రాలను అందజేశారు. జిల్లా పరిధిలోని అన్ని తహశీల్దార్ కేంద్రాలయాల్లోనూ, ట్రెజరీ కార్యాలయాల్లోనూ సంబంధిత తాలూకా యూనిట్ కార్యవర్గం ఆధ్వర్యం లో వినతి పత్రాలను అందజేసినట్లు వారు తెలిపారు. ప్రతినెల 1వ తేదీక పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక మెడికల్ అలవెన్సులు అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలను విడుదల చేయాలని కరారు. పిఆర్‌సి అరియర్స్, కొత్త వేతన సంఘం ఏర్పాటు, పిఆర్‌సి స్టేట్మెంట్స్ , ఆనామలిస్ కమిటీ ఏర్పాటు మొదలగు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమలో పెన్షనర్ల సంఘం నాయకులు పుట్టపర్తి నాగార్జున శెట్టి, టి. రామప్ప, కడియాల జయరామ్, వెంకటేష్, బి. కొనప్ప, కే. అశోక్ గుప్త, నాగభూషణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రామాంజనేయ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గఫార్, రిటైర్డ్ హెచ్ఎం సుభాన్, రిటైర్డ్ ఉద్యోగులు వెంకటప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు

ఆస్తికోసమే హత్య

మడకశిర : మండలంలోని కల్లుమర్రి గ్రామానికి చెందిన హనుమంతప్ప హత్య కేసులో నిందితులు మృతుని భార్య అక్కమ్మ , కుమార్తె అనిత అని పోలీసులు తెలిపారు. ఆస్తికోసమే హనుమంతప్పను హత్య చేశారని చెప్పారు. సిఐ సురేష్ బాబు గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకేసు వివరాలను వెల్లడించారు. కల్లుమర్రి గ్రామానికి హనుమంతప్ప, ఆయన భార్య అక్కమ్మకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె అనితను హిందూపురం పరిధిలోని కిరికెర గ్రామానికి చెందిన సురేష్ కు ఇచ్చి వివాహం చేశారు . అయితే వారికి సంతానం కలుగలేదు. దీంతో అనిత చెల్లెలైన సంధ్యారాణిని కూడా ఇవ్వాలని అక్కమ్మ, అనిత భావించారు. హనుమంతప్ప ఆస్తిని తామే దక్కించుకోవాలని భావించిన వారి చర్యలకు హనుమంతప్ప అడ్డు చెప్పాడు. సంధ్యను మరొకరికి ఇచ్చి వివాహం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో సంధ్యను 12 రోజుల క్రితం పావుగడ తాలూకాలోని నాగవల్లాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు ఇచ్చి వివాహం చేశాడు. ఇది జీర్ణించుకోలేని హనుమంతప్ప భార్య అక్కమ్మ, కుమార్తె అనిత హనుమంతప్పను చంపడానికి పథకం పన్నారు. పశువుల కొట్టంలో రాత్రి 11 గంటల సమయంలో తల్లి కుమార్తె ఇద్దరు కలిసి హనుమంతప్ప కళ్లలో కారం చల్లి గొడ్డలికి ఉపయోగించే కట్టెతో తలపై, మర్మాంగంపై విచక్షణ రహితంగా కొట్టి చంపారు. ఈ హత్యపై మృతుడు హనుమంతప్ప అన్న బూసప్ప కుమారుడు సంజీవప్ప ఫిర్యాదు మేరకు మడకశిర పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి నిందితులైన అక్కమ్మ, అనితను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు .

విద్యుత్ షార్ట్ సర్క్యూట్

గోరంట్ల : మండలంలోని మరెడ్డిపల్లిలో గురువారం మధ్యాహ్నం రైతు రామకృష్ణ నివాసంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ. 20వేల నగదు తో పాటు విలువైన గహపరికరాలు, నిత్యవసర సరుకులు, బట్టలు అగ్నికి ఆహుతయ్యాయని బాధితుడు వాపోయాడు. వేడిమికి గోడలు సైతం బీటలు ఏర్పడ్డాయన్నారు. తనకు మూడు లక్షల రూపాయలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని వాపోయాడు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

బార్ అసోసియేషన్ మహిళా విభాగం ప్రారంభం

హిందూపురం : బార్ అసోసియేషన్ మహిళా విభాగాన్ని అదనపు జిల్లా జడ్జి శైలజ గురువారం ప్రారంభించారు. స్థానిక కోర్టు ఆవరణలో ఉన్న భవనాన్ని మహిళా న్యాయవాదుల కోసం ఎడిజె కేటాయించారు. దీంతో ఆ భవనాన్ని ప్రత్యేకంగా రూపుదిద్దుకోవటంతో ఎడిజెతో పాటు న్యాయమూర్తులు శ్రీధర్ ,రాజ్యలక్ష్మి, ఆనంద తీర్థ, సుకుమార్ ప్రారంభించారు. అనంతరం ఎడిజె కోర్టు ఆవరణలో శైలజ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యాయవాదులు మహిళా ఉద్యోగులను సన్మానించి, బహుమతులు అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగప్ప, ఎపిపి ఇందాద్, ఎజిపి శ్రీనివాస్ రెడ్డి, మహిళా న్యాయవాదులు కళావతి, రత్నమ్మ, సంతోషి కుమారి, నవేరా, వందన, పవిత్ర, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశకి - కదిరి అర్బన్

శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 13వ తేదీన నిర్వహించే రథోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి గురువారం పరిశీలించారు. తిరువీధులను తిరిగి రథోత్సవానికి చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. రథోత్సవానికి వచ్చు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలిగించకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్, సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం పట్ల బాధ్యత తీసుకోవాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

భవిష్యత్తు తరాల పిల్లల ఆరోగ్యం కోసం రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వైద్యాధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ దినోత్సవంపై జిల్లా కోఆర్డినేషన్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలన్నారు. ఈనెల 14, 18 తేదీలలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటిఐ, పాలిటెక్నికల్, అంగనవాడీ కేంద్రాలలో ఒకటి నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, పోగ్రాం అధికారి కుళ్లాయిస్వామి, డాక్టర్ నివేదిత, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, బిసి, ఎస్‌టి, ఎస్‌సి సంక్షేమ శాఖ అధికారులు నిర్మల జ్యోతి, శివ రంగ ప్రసాద్, మోహనరావు, పుట్టపర్తి కమిషనర్ వెంకటరామిరెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

త్వరలో కల్యాణ మండపం నిర్మాణం

హిందూపురం : శ్రీ హజరత్ సయ్యదీన బుడేన్ షా భాదిరి వెల్ ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళ్యాణమంటపాన్ని నిర్మాణం చేసి త్వరలో అన్ని వర్గాల వారికి అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు షరీఫ్ తెలిపారు. పరిగి మండలం శ్రీరంగరాజుపల్లిలోని హజరత్ సయ్యద్ షేక్ బుడేన్ షా ఖాదరి వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కర్ణాటక రాష్ట్రం సిడ్లగట్టకు చెందిన సల్మాన్ ఖాద్రి, ప్రొద్దుటూరుకు చెందిన సాధిక సంజీరీల ఖవ్వాలి కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా శ్రీ హజరత్ సయ్యదీన బుడేన్ షా భాదిరి వలి దర్గా వెల్ఫేర్ ట్రస్టు నిర్వహకులు ప్రముఖులకు ఘనంగా సన్మానించారు. అనంతరం షరీఫ్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కళ్యాణ మండపాల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దీంతో సామాన్యులకు మోయలేని భారంగా మారిందన్నారు. అందుకోసమే ట్రస్ట్ ఆధ్వర్యంలో కళ్యాణమంటపాన్ని నిర్మాణం చేసి వివాహాది శుభకార్యాల కోసం వినియోగిస్తామన్నారు. ఇప్పటికే పనులు ప్రారంభించామని త్వరలో అందుబాటులోకి తీసుకుని వస్తామని అన్నారు. దీంతోపాటు మరిన్ని సేవా కార్యక్రమాలు ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వహకులు బాబాజాన్, షరీఫ్, బాబు, బుడేన్, సున్ని జమాత్ ప్రతినిధులు మహబూబ్ బాషా, డాక్టర్ వారీస్, ఇస్మాయిల్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

ఖవ్వాలిలో పాల్గొన్న ప్రముఖ గాయకులు

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలి

కదిరిలోని సమావేశంలో పాల్గొన్న అధికారులు, నాయకులు, మహిళలు

పెనుకొండలో ప్రశంసాపత్రం అందజేస్తున్న సబ్‌కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని సిఐటియు నాయకులు జివిఎల్ నరసింహులు , జగన్మోహన్ పేర్కొన్నారు .అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక వికలాంగుల భవనంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, కదిరి ప్రాజెక్టు నాయకురాళ్లు రంగమ్మ, కమలమ్మ, సుజాత, సువర్ణ, రామలక్ష్మమ్మ, ఐద్వా నాయకురాలు శాంతిభాయి, నాగమణి, అమరావతి, హేమావతి సిఐటియు నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తక్ అలీ, ఫాజిల్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేటికీ మహిళల పై వివక్ష, అణిచివేత , మహిళలపై దాడులు జరుతుతున్నాయనానరు. హక్కుల కోసం పోరాడే మహిళలకు ప్రజాస్వామ్య వాదులు, అభ్యుదయవాదులు అండగా ఉండాలని కోరారు.

ఓబుల దేవర చెరువు : స్థానిక ఐకెపి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్వీన్ భాను, ఎంపీడీవోపోలప్ప, తహశీల్దార్ శ్రీధర్, ఎస్ఐ గోపీ, ఏరియా కోఆర్డినేటర్ రామమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు. అంతకు ముందు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంక్ మేనేజర్ కుసుమ కుమారి, జిల్లా సమైక్య మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, లక్ష్మీనరసమ్మ, అకౌంటెంట్ లక్ష్మి శ్రీరాములు, సీసీలు వివిధ గ్రామ సంఘాల వివోలు, ఆనిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : లింగ సమానత్వం పెంపొందించాలని సబ్ కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణంలోని భువన విజయ సమావేశ భవనంలో ఐసిడిఎస్ సిడిపిఒ జి.శాంత లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ కె. కార్తీక్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.లక్ష్మీ కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ చిన్న పిల్లల నుంచే లింగ సమానత్వం పెంపొంచాలని అన్నారు. పీడీ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు మరింత సమర్థవంతంగా పని చేయాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ బి.విశ్వనాథ్ మాట్లాడుతూ ఆనాది కాలం నుండి స్త్రీలు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎదుర్కొని ముందుకు వెళుతున్నారన్నారు. సిడిపిఒ మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగం లోనూ అభివృద్ధి చెందాలన్నారు. ఎజిపిఎం భాస్కరరెడ్డి మాట్లాడుతూ మహిళా చట్టాలు – హక్కులు గురించి అవగాహన కల్పించారు. అనంతరం 6 మండలాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన అంగన్వాడీ టీచర్లకు, ఐసిడిఎస్ సిబ్బందికి సబ్ కలెక్టర్ ప్రతిభా పురస్కారాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం .సుజాత, అనురాధ, నాగరాణితో పాటు శ్రీదేవి ,షహనాజ్, బావమ్మ , మీనా , శోభ , అనురాధ, నాగమణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెనుకొండ ఐ సి డి ఎస్ తరపున అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా 10 వేల రూపాయలు రెడ్‌క్రాస్ సంస్థ కోసం విరాళం అందజేశారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ రమేష్,రఘునాథ రెడ్డి, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి చెన్నకృష్ణ కోరారు. కదిరి రెడ్స్ రిసోర్స్ సెంటర్‌లో రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతితులుగా హైదరాబాదుకు చెందిన చిట్రా సంస్థ నుండి సురేష్, మండల విద్యాధికారి హాజరయ్యారు. సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారన్నారు. మహిళలు ఐకమత్యంగా ఉండి వార హక్కులను సాధించు కోవాలన్నారు. సురేష్ మాట్లాడుతూ దేశం ఇంత అభివద్ధి చెందినా ఇప్పటికి కొన్ని చోటల మహిళలకు సమానత్యం లేదనానరు. ప్రవేటు రంగాలలో సమాన వేతనం ఇవ్వటం లేదనానరు. సామాజికంగా ఒంటరి మహిళలను చిన్న చూపు చూస్తున్నారన్నారు. రెడ్స్ సంస్థ డైరెక్టర్ భానూజా మాట్లాడుతూ ఒంటరి మహిళలతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేశామని ఈకమిటీ మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని చెప్పారు.

యువతను ఓటు అడిగే హక్కు వైసిపికి లేదు

ప్రజాశక్తి గోరంట్ల

పట్టభద్రులైన యువతను ఓటు వేయమని అడిగే హక్కు వైసిపి ప్రభుత్వానికి లేదని మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ పట్టణంలో తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వక కార్యదర్శి సవితమ్మ తదితరులు పాల్గొన్నారు. నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు చాలా అన్యాయం చేసిందన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిందన్నారు. జగన్ పాలనలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. సవితమ్మ మాట్లాడుతూ సహజ వనరులను, ప్రజల సొమ్మును దోచుకు తినడానికి వైసిపి నాయకులు పోటీపడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. మేధావులు యువత మేలుకొని జరగబోవు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

టిడిపిలో పలువురు చేరిక

మడకశిర : మండలంలోని మనురు పంచాయతీ ఉప్పిడి పల్లి గ్రామానికి చెందిన పలువురు టిడిపిలోకి గురువారం చేరారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన లక్ష్మీనారాణప్ప, రామచంద్రప్ప, మంజునాథ్, మారుతి, ఓబులేసు, హనుమంతప్ప తదితర వైసిపి నాయకులు టిడిపిలోకి చేరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ,గుండుమల తిప్పేస్వామి వారికి టిడిపి కండూవాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, నాయకులు లక్ష్మీనారాయణ, మనోహర్, నరేశ్ కన్నా, కల్లుమర్రి నాగరాజు, కోట్ల రంగేగౌడ, డాక్టర్ కృష్ణమూర్తి, ఆనంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ చెస్ పోటీలకు కెహెచ్ డిగ్రీ కళాశాల విద్యార్థి

ధర్మవరం టౌన్ : సౌత్ జోన్ చెస్ పోటీలకు స్థానిక కెహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన వంశీకృష్ణ అనే విద్యార్థి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఎస్కే యూనివర్సిటీ నిర్వహించిన సెలక్షన్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వంశీకృష్ణ ఎస్కేయూ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థి చెన్నైలోని ఎస్పీఎం యూనివర్సిటిలో ఈనెల 10 నుండి ప్రారంభమయ్యే సౌత్‌జోన్ పోటీల్లో ఎస్కేయూ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి వంశీకృష్ణను కళాశాల ప్రిన్సిపల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ జీవన్‌కుమార్, పీడీ ఆనంద్, అధ్యాపకులు చిట్టెమ్మ, షమీవుల్లా, కిరణ్‌కుమార్, గోపాల్‌నాయక్, పావని, భువనేశ్వరి, పుష్పవతి, గౌతమి అభినందించారు.

చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో అధ్యాపకులు

సూర్య,చంద్రప్రభ వాహనాలపై నారసింహుడు

ప్రజాశక్తి కదిరి అర్బన్

సూర్య, చంద్ర ప్రభ వాహనంపై ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి తిరువీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సూర్య, చంద్ర ప్రభవాహనంపై స్వామివారి మూలవిరాట్‌ను ఊరేగించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం సూర్యప్రభ వాహనంలో, .రాత్రికి చంద్రప్రభ వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా శ్రీరామమూర్తి భార్య సుగుణమ్మ కీర్తన వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణములోని కళ్యాణ వేదికపై కళాకారులు పలు రూపాలలో నాటకాలు ప్రదర్శించారు. ఈ ఉత్సవాలలో పాలక మండలి చైర్మన్ జరిపిటి గోపాలకృష్ణ, ఆలయ కార్య నిర్వహణ అధికారి గురుప్రసాద్, కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో సిఐ తమ్మిశెట్టి మధు , నిరంజన్ రెడ్డి, సూర్యనారాయణ, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు మోహిని అవతారం: బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం 10రోజు మోహినీ అవతారంలో ఖాద్రీశుడు దర్శనమివ్వనున్నారనిప్రధాన అర్చకులు నరసింహ రావు, కుమార్ స్వామీలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉభయ దారులుగా కోట వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు వ్యవహరిస్తానని చెప్పారు.

సూర్యప్రభ వాహనాన్ని లాగుతున్న ప్రముఖులు

పశువుల సంతకు వేలంపాట

గుడిబండ : స్థానిక పంచాయతీ కార్యాలయంలో పశువుల సంత మార్కెట్ వేలం పాటను గురువారం నిర్వహించారు. ఇఒఆర్‌డి నాగరాజు నాయక్, స్థానిక సర్పంచి కరుణాకర్ సమక్షంలో పశువుల సంత, వారపు సంత, దినసరి బస్టాండ్‌కు వేలంపాట నిర్వహించారు. పశువుల సంత మార్కెట్ వేలంలో సంవత్సరానికి గుడిబండకు చెందిన భోజరాజు అనే వ్యక్తి దక్కించుకున్నాడు. అదేవిధంగా వారపు సంత కూరగాయల సంత మార్కెట్ గుడిబండ కు చెందిన లక్ష్మయ్య, బస్టాండ్ దినసరి వేలంపాట గుడిబండకు చెందిన భోజరాజు దక్కించుకున్నాడు. ఈ వేలం పాటతో గతంలో కన్నా మూడురెట్ల ఆదాయం పంచాయతీకి వచ్చిందని అధికారులు తెలిపారు.

మహారాజశ్రీ కదిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.205/2021
Between:
రాజనాల శివారెడ్డి S/o రామచంద్రారెడ్డి, బురుజుపల్లి H/o తలుపుల, తలుపుల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది
మరియు
టి.ఎం. చిన్న నాగభూషణ ...ప్రతివాది
ప్రతివాదికి దావా నోటీసు
To,
టి.ఎం. చిన్న నాగభూషణ S/o వెంకటరమణ, తలుపుల గ్రామం & మండలం, శ్రీసత్యసాయి జిల్లా.
అను మీపైన వాది అయినటువంటి రాజనాల శివారెడ్డి దావా వేసియున్నారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం 20-03-2023 తేదీన పై వారి కోర్టు నందు వాయిదా ఉన్నది. సదరు వాయిదా తేదీన మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉ॥10.30 గం॥లకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనచ్చును. అట్లు హాజరుకాని యెడల దావా మీ పరోక్షములో తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:20-03-2023
వి.ప్రసాద్‌రెడ్డి, బి.ఎ., బి.ఎల్.
వాదిపరం వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.

మహారాజశ్రీ కదిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.148/2016
Between:
వై.చెన్నకేశవరెడి S/o రామచంద్రారెడ్డి, డోర్‌నెం.1-127-ఇ, చిన్నగానిపల్లి, అమడగూరు మండలం, శ్రీసత్యసాయి జిల్లా. ...వాది
మరియు
మాసిరెడ్డి మునిరెడ్డి మరియు ఇతరులు ...ప్రతివాదులు
4వ ప్రతివాదికి దావా నోటీసు
To,
D4:
మాసిరెడ్డి ఆదినారాయణరెడ్డి S/o సుబ్బిరెడ్డి, గుజ్జేవాండ్లపల్లి @ గంగిరెడ్డిపల్లి H/o మద్దెపల్లి, గూళూరు హోబ్లి, బాగేపల్లి (తాలూకా), చిక్‌బళ్ళాపూర్ (జిల్లా), కర్ణాటక స్టేట్
అను వై.చెన్నకేశవరెడ్డి దావా వేసియున్నారు. సదరు దావా పై వారి కోర్టు నందు మీ హాజరు నిమిత్తం 23-03-2023 తేదీన వాయిదా ఉన్నది. సదరు వాయిదా తేదీన మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉ॥10.30 గం॥లకు పై వారి కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనచ్చును. అట్లు హాజరుకాని యెడల మీ పరోక్షములో దావా తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:23-03-2023
కె.గంగాధర, బి.కామ్.
వాదిపరం వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి
O.P.95/2022
Between:
డి.అనురాధ W/o డి.వినోద్‌కుమార్‌రెడ్డి, డోర్‌నెం.12-31, దేవిరెడ్డిపల్లి, నల్లచెరువు మండలం. ...పిటీషనర్
మరియు
దేవరింటి వినోద్‌కుమార్‌రెడ్డి S/o సిద్దారెడ్డి, డోర్‌నెం.14-21ఎ, దేవరింటిపల్లి, నల్లచెరువు మండలం. ...రెస్పాండెంట్
రెస్పాండెంట్‌కు నోటీసు
పై అర్జీలో పిటీషనర్ విడాకుల కొరకు వేసిన దావాలో మీ హాజరు నిమిత్తమై 06-04-2023వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 06-04-2023 వ తేదీన ఉ॥10.30 గం॥లకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరు కావలయును. అట్లు హాజరుకాని పక్షములో పై అర్జీని పై కోర్టువారు మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలుపడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:06-04-2023
స్థలం:కదిరి.
ఎస్.రామచంద్రారెడ్డి, బి.ఎ., బి.ఎల్.
కె.నరేంద్ర, బిబిఎ ఎల్ఎల్‌బి.
పిటీషనర్ తరపు వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.

In the Court of the Senior Civil Judge: Penukonda
O.S.No.8/2021
Between:
B.P.Gangadharappa and another ...Plaintiff
And
Bestha Saraswathamma and others ...Defendants
పై నెంబరు దావాలోని 4వ ప్రతివాదికి దావా సమన్లు
To,
D4: Sumalatha D/o Peddanna, D.No.211, Cherukuru, Roddam Mandalam.
యిందుమూలకముగా నీకు తెలియచేయుదమేమనగా పై నెంబరు దావాలోని వాదులు దావా షెడ్యూలు దాఖలా ఆస్తులు విభాగమునకు పై కోర్టులో దావా దాఖలు చేసినారు. సదరి విషయముపై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న ఎడల మీరు 13-03-2023వ తేదిన ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ వాదనను కోర్టువారికి తెలుపుకొనవలయును లేని ఎడల మీ పరోక్షమందు పై దావాను తీర్మానము చేయుదురని యిందుమూలకముగా నీకు తెలియచేయడమైనది.
(By Order of the Court)
ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, వాదులపరం వకీలు, పెనుకొండ.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి
I.A.66/2021 in O.S.334/2021
Between:
చెరువు గంగిరెడ్డి ...పిటీషనర్-వాది
మరియు
చెరువు తిరుపాల్‌రెడ్డి మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్-ప్రతివాదులు
To,
R8: తనకంటి చంద్రకళమ్మ W/o ఈశ్వరరెడ్డి, కొండ్రవారిపల్లి, H/o నల్లమాడ, నల్లమాడ మండలం.
R9: మేక నీలమ్మ W/o అయ్యారెడ్డి, బడవాండ్లపల్లి, H/o చారుపల్లి, నల్లమాడ మండలం.
8 మరియు 9వ రెస్పాండెంట్స్‌లకు నోటీసులు
పై అర్జీలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తమై 06-04-2023వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 06-04-2023 వ తేదీన ఉ॥10.30 గం॥లకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరు కావలయును. అట్లు హాజరుకాని పక్షములో పై కోర్టువారు పై అర్జీని మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలుపడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:06-04-2023
స్థలం:కదిరి.
ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, బి.ఎ., బి.ఎల్.
వాదితరపు వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి
O.S.No.334/2021
Between:
చెరువు గంగిరెడ్డి ...వాది
మరియు
చెరువు తిరుపాల్‌రెడ్డి మరియు ఇతరులు ...ప్రతివాదులు
To,
D8: తనకంటి చంద్రకళమ్మ W/o ఈశ్వరరెడ్డి, కొండ్రవారిపల్లి, H/o నల్లమాడ, నల్లమాడ మండలం.
D9: మేక నీలమ్మ W/o అయ్యారెడ్డి, బడవాండ్లపల్లి, H/o చారుపల్లి, నల్లమాడ మండలం.
8 మరియు 9 ప్రతివాదులకు దావా సమన్లు
పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తమై 06-04-2023వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 06-04-2023 వ తేదీన ఉ॥10.30 గం॥లకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరు కావలయును. అట్లు హాజరుకాని పక్షములో పై కోర్టువారు పై దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలుపడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:06-04-2023
స్థలం:కదిరి.
ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, బి.ఎ., బి.ఎల్.
వాదితరపు వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి
I.A.65/2021 in O.S.334/2021
Between:
చెరువు గంగిరెడ్డి ...పిటీషనర్-వాది
మరియు
చెరువు తిరుపాల్‌రెడ్డి మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్-ప్రతివాదులు
To,
R8: తనకంటి చంద్రకళమ్మ W/o ఈశ్వరరెడ్డి, కొండ్రవారిపల్లి, H/o నల్లమాడ, నల్లమాడ మండలం.
R9: మేక నీలమ్మ W/o అయ్యారెడ్డి, బడవాండ్లపల్లి, H/o చారుపల్లి, నల్లమాడ మండలం.
8 మరియు 9వ రెస్పాండెంట్స్‌లకు నోటీసులు
పై అర్జీలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తమై 06-04-2023వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు 06-04-2023 వ తేదీన ఉ॥10.30 గం॥లకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరు కావలయును. అట్లు హాజరుకాని పక్షములో పై కోర్టువారు పై అర్జీని మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలుపడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:06-04-2023
స్థలం:కదిరి.
ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, బి.ఎ., బి.ఎల్.
వాదితరపు వకీలు, కదిరి, శ్రీసత్యసాయి జిల్లా.